ఓంశ్రీసాయిరాం

ప్రచండమారుతమువలె కాలము అతివేగముగా కదలిపోవుచున్నది. మంచుగడ్డవలె ఆయుష్కాలము కరగిపోవుచున్నది. అయిననూ, తాను జన్మించి, జీవించి నిర్వహించవలసిన కర్తవ్యమునే మానవుడు గుర్తించక వెళ్లిపోవుచున్నాడు. ఇది ఒక శోచనీయ పరిస్థితి. మీరు విద్యాబోధకులు. ఉపాధ్యాయులు. చక్కని శిల్పులవంటివారు. కొండలోని గుండుబండలను తీర్చిదిద్ది గుడిలో ప్రతిష్ఠించే అర్హతను వాటికి అనుగ్రహింపగల శక్తిసామర్థ్యములు శిల్పులకున్నవి. అట్లనే, మీ దగ్గర విద్యార్జనకొరకు వచ్చే పిల్లలకు విజ్ఞాన, సుజ్ఞాన, ప్రజ్ఞానముల ననుగ్రహించి వారి మానవత్వమును సార్థకముచేసే పవిత్ర సేవ మీది. బాలబాలికల హృదయములలో ప్రేమబీజములను నాటి సహనప్రసూనములను పెంచి శాంతిఫలములను పరమాత్మునికి అర్పించేదే ఉపాధ్యాయులు చేయవలసిన కర్తవ్యము. అనాది కాలమునుండి వేదవిహిత కర్మలనాచరించి, దైవప్రీతి పాపభీతులనభివృద్ధి చేసికొని మహర్షులు తమ మతిని మథించి సేకరించిన సుధానిధియైన సనాతన ధర్మపద్ధతులన్నీ ఈనాడు క్షీణించి, కేవలము మాటలలో మాత్రము నిలచి, ఆచరణలో శూన్యమైనది. చెప్పుమాటలకు చేసేపనులకు యేమాత్రమూ పొందికలేకున్నది. సమరమును స్వాగతించుచూ శాంతిసభలను జరుపుచున్నారు. అర్థములేని వ్యర్థపుపనులలోనే కాలమును గడుపుచున్నారు.

మంత్రిగారు సత్యాన్వేషణయే మానవునికి నిత్యకృత్యమన్నారు. సత్యమును అన్వేషించనక్కరలేదు. అందరూ సత్యస్వరూపులే కాబట్టి సత్యమందరికీ సులభవేద్యమే. దొంగకు తెలుసు తాను సత్యదూరుడై దొంగతనము చేసినానని. సత్యస్వరూపుడని తెలుసుకొని, మనసా వాచా కర్మణా, ఆసత్యమును ప్రకటన చేసితే సత్యజ్యోతియొక్క సహజ ప్రకాశమునకు అడ్డుచేయక కర్తవ్యమును నిర్వర్తించి నట్లగును. పిల్లలను బయటివారుగా తలంచక, మనవాళ్ళుగా ప్రేమించి, సరైన తరిఫీదునిచ్చి, మంచి ప్రజలుగా తయారుచేయండి. పిల్లలలో యేమీ దోషము లేదు. తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు సరైన మార్గములో వారిని పెంచి పోషించాలి. పిల్లల తెలివితేటలు మహాసూక్ష్మమైనవి. మీరు ఆచరించకపోతే, మీరు బోధించిన విషయములు వారు ఒప్పుకోరు.

ఇంత శ్రమపడి ఉత్తమ శిక్షణపద్ధతులను కనిపెట్టిన తరువాత డైరెక్టరుగారు చెప్పునట్లు, మీరే వాటిని ఆచరించి అనుసరించి ఫలమునందుకోవలెను. మరొకటి. పిల్లల తల్లదండ్రులను కూడను మాసమునకొక పర్యాయముగాని, రెండు పర్యాయములుగాని కలసికొని, వారి ద్వారా పిల్లల పరిస్థితి, వారి శక్తిసామర్థ్యములు, వారి వినయవిధేయతలు, వారి శీలసంపత్తు యెంతమాత్రము అభివృద్ధి అయినవని కనుగొనుటకు పూనుకొనవలెను. మీ కామబిడ్డలను మీరు పోషించి, లాలించి అభివృద్ధికి తెచ్చినట్లే, మీ ప్రేమబిడ్డలైన విద్యార్థులనూ తీర్చిదిద్దటానికి ప్రయత్నించవలెను.

ఈనాడు భారతదేశము మాత్రమే కాకుండా అన్యాయ అక్రమ అసత్యములు పైశాచిక స్వరూపముదాల్చి ప్రళయతాండవ మొనర్చుటవలన, ప్రపంచమంతా భయభ్రాంతులతో బాధపడుచున్నది. విద్యార్థులపై అధికార శ్తానమును పొందిన మీరు మీ జీవితమును బిడ్డల అభివృద్ధికోసము అర్పించిన లోకకల్యాణమేర్పడును. ఏ పనిచేసినా, ఏ చూపుచూచినా, ఏతలంపుతలచినా ప్రేమను పెంచండి. ప్రేమభావమును పెంచకపోతే ప్రపంచమంతా ప్రళయస్వరూపము కాకతప్పదు. మతిని చక్కచేయుకొరకు మతము కావలెను. మతములన్నింటికన్న ర్పమమతమే ఉత్తమమైనది. love is God, live in love అనేదే మీ జీవిత సూత్రముగా వుండవలెను.

కొంలోతుగా విచారణ సలిపిన ఉపాధ్యాయులైన మీరే నిజమైన విద్యార్థులు. మీ విద్యార్థులు యేదో యెనిమిది పది సంవత్సరములు గ్రంథములను చదువుకొని, డిగ్రీలనందుకొని, నౌకరీలో చేరిపోతారు. అయితే, జీవితమంతా తీరని చదువు మీదే. జీవితమంతా విద్యనందించి, విద్యనందుకొని ఆనందించేది మీరే. దిల్ మే రాం, హాత్ మె కాం అన్నాడు కవి. అన్నీ రామకార్యములే. అన్నీ భగవత్ కైంకర్యములే. భగవంతుని బిడ్డలసేవయే. ఈ పవిత్ర భావములను మీ హృదయములో నింపుకొని, భారతీయుల ప్రత్యే ఆస్తి అయిన త్యాగశీలము, సహన, సమరసము వీటిని మీ వాక్కుల ద్వారా, క్రియల ద్వారా, తలంపుల ద్వారా పిల్లలకు అందించండి. do good, be good, see good. వట్టి మాటలతో ఫలములేదు. మీరు నడచవలెను, మీరు చేయవలెను. ఏడ్చే బిడ్డను పరుగెత్తి వచ్చి నడుము వంచి యెత్తుకొంటుంది తల్లి. ఆ బిడ్డ, 'నాకు లొంగినది తల్లి' అని అనుకోవచ్చు. అయితే, ఆ లొంగటము తల్ల బలహీనత కాదు. బిడ్డయొక్క అధికారమువలన కాదు. అది ప్రేమతత్త్వమే! అంతియే. మీరుకూడా పిల్లలను తీర్చిదిద్ది, వారిని వాత్సల్యముతో ప్రేమించి అభివృద్ధికి తీసుకొని రావలెను. గురు అనే పవిత్ర నామమును మీకు అందించినారు పెద్దలు. గురుసాక్షాత్ పరబ్రహ్మ అనేవరకూ గురువులను గౌరవించినది ఈ దేశము. ఆ గురుత్వమునకు తగురీతిగా వర్తించి సేవచేయవలయును.

మానవత్వము రూపముతో మాత్రము నిరూపణ చేసిన చాలదు. ఏనుగుకు రెండు కొమ్ములున్నాయి. యెనుముగొడ్డుకూ రెండు కొమ్ములున్నాయి. అయితే, అవి రెండూ సమమా? క్రియాత్మకముగా మానవత్వమును నిరూపించవలెను. జననమరణ చక్రము నుంచి తప్పించుకొని ఆత్మసాక్షాత్కారము నందుకోవాలి. అదే జన్మసార్థకత. ప్రధానమైన ఈ ఘనకార్యము సాధించవలెనన్న దానికి గురువు అత్యవసరము. పూలు, సూది, దారము అన్నీ వుండిన పుష్పమాల తయారగునా? కుట్టేవారు ఒకరు కావలెను కదా! స్వర్ణము, రత్నములు మాత్రముండిన సొమ్ములు తయారగునా? ప్రమిద వత్తి నూనె మూడూ వుండిన మాత్రమున దీపము వెలుగునా? ముట్టించేవాడు ఒకడు వుండాలి కదా! అట్లనే ఇచ్ఛ వుండవచ్చు. బుద్ధి వుండవచ్చు. గురువు లేక జ్ఞానము కలుగదు. విద్యార్థుల